క్లుప్తంగా

నేడు పార్వతీపురంలో చికెన్, ఎగ్ ఉచిత మేళా

పార్వతీపురం: బర్డ్‌ఫ్లూపై ప్రజల్లో ఉండే అపోహలను తొలగించేందుకు గాను జిల్లా కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత చికెన్, ఎగ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎస్. మన్మథరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 5గంటల నుంచి ఏడు గంటల వరకు పార్వతీపురంలోని భాస్కర డిగ్రీ కళాశాల సమీపంలోను, కొత్తవలస అమ్మవారి గుడి సమీపంలోను ఈ ఉచిత మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో ప్రాంతంలో 200కేజీల చికెన్ వంటకాలను, 2 వేల ఉడికించిన గుడ్లను ఉచితంగా పంపిణీ చేయనున్నామన్నారు.

గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

సాలూరు రూరల్: షెడ్యూల్ ఏరియాలో ఉద్యోగ ఉపాధ్యాయ నియామకాలు 100 శాతం గిరిజనులకే కేటాయించాలని స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదివాసీ సంఘం నాయకులు గిరిజన శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సీదరపు అప్పారావు మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీ విడుదలపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నియోజకవర్గంలో ఉన్న గిరిజనుల అన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు.

జైభారత్ ప్రధాన కార్యదర్శి రేపు రాక

పార్వతీపురంటౌన్: జై భారత్ ప్రధాన కార్యదర్శి పార్వతీపురం మన్యం జిల్లాకు మంగళవారం రానున్నట్లు జై భారత్ జాతీయ సభ్యుడు గంటా రామకృష్ణ తెలిపారు. పార్వతీపురం బెలగాంలో ఉన్న గిరిజన సామాజిక భవన్‌లో జరగనున్న జై భారత్ జిల్లా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా వచ్చి ప్రసంగించబోతున్నట్లు తెలిపారు. భావితరాలకు దేశ భక్తిని. ఆధ్యాత్మికత విలువల్ని, సామాజికంగా, సామాజిక బాధ్యతతో యువతను సన్మార్గంలో నడవడానికి ఆరోగ్యాన్ని పెంపొందించుకుంటూ, ఖదిజ్ఞాని విలువలతో కూడిన పద్ధతులను మతోన్మాద అంతానికి తీవ్రంగా కృషి చేస్తుంది జై భారత్ సంస్థ అని అన్నారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి గిరిజన సామాజిక భవన్‌లో సమావేశం మొదలవుతుందని ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ట



నూతనంగా నిర్మించిన నీలకంఠస్వామి ఆలయం

పార్వతీపురం రూరల్: మండలంలోని పిట్టలవలస గ్రామంలో శ్రీ నీలకంఠస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వయంభూగా వెలసిన ఈ ఆలయంలో నిర్మించిన గణపతి, పార్వతీదేవి ఉపాలయాలతో పాటు ధ్వజస్తంభం ఏర్పాటు చేయనున్నారు. శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించి ధ్వజస్తంభం ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధికంగా పాల్గొనాలని కోరారు.

సారికవీధిలో ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురంలోని సారికవీధి పురపాలక ప్రాథమిక పాఠశాల ఆవరణలో శ్రీ చంద్రమౌళీశ్వర శాలివాహన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 268 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేసినట్లు సంఘంప్రతినిధులు తెలిపారు.

రైతులకు పెట్టుబడి సహాయం అందించాలి

పాలకొండ: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఆర్థిక సహాయం అందించాలని సీపీఎం నాయకుడు దావాల రమణారావు ఒక ప్రకటనలో కోరారు. రైతు భరోసా స్థానంలో రైతులకు రూ.20వేలు ప్రతి ఏటా అందిస్తామని చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తించాలని కోరారు. పెరిగిన వ్యవసాయ పెట్టుబడులు, మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్రం అందించే కిసాన్ నిధులతో పాటు రాష్ట్రం చెల్లించాల్సిన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. రైతులకు ఆర్థిక సహాయం అందించకపోతే రైతు సంఘాలతో పాటు కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.



రామస్వామి వలసలో సమస్యల తిష్ఠ

- తాగునీరు, విద్యుత్ లోవోల్టేజీతో సతమతం
- సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించినా పట్టించుకోని అధికారులు



గ్రామంలో నిరుపయోగంగా మంచినీటి ట్యాంక్

సాలూరురూరల్:

కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఒక వైపు ప్రసంగాలతో ఊదరగొడుతుంటే మరోవైపు గ్రామాల్లో ప్రజలు తాగునీరు, విద్యుత్ సమస్యలతో సతమతమవుతున్నారు. ఇలాంటి పరిస్థితులను మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పెదపదం పచాయతీ రామస్వామివలస గ్రామంలో ప్రజలను సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. గ్రామంలో తాగునీరు, విద్యుత్ లోవోల్టేజీ సమస్య వారికి



పెచ్చులు ఊడి ప్రమాదభరితంగా ఉన్న పాఠశాల



ఊరి బయట నుంచి నీరు మోసుకువస్తున్న మహిళ

గ్రహపాటుగా మారింది. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో తాగునీరు, విద్యుత్ లోవోల్టేజీ విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఇంతవరకు ఒక్కరూ పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో సుమారు 50 ఇళ్లు ఉంటాయి. ఇక్కడ జలజీవన్ మిషన్ పథకం అమలు చేయలేదు. అలాగే పాత వాటర్ ట్యాంక్ ఉన్నప్పటికి లోఓల్టేజీ సమస్యతో మోటార్ పనిచేయక ఉన్న కుళాయిలు, వాటర్ ట్యాంక్ అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. గ్రామానికి చివరలో కమ్యూనిటీ భవనంలో బోరు నీటిని గ్రామస్తులు వినియోగిస్తున్నారు. తాగునీరు అవసరమైనా, వాడుక నీరు అవసరమైనా కమ్యూనిటీ భవనం వద్దకు వెళ్లి బోరు ఆన్ చేసుకుని ఎప్పటి నీరు అప్పుడు తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కసారి రోజంతా కరెంటు లేకపోతే పొరపాటున ఇంట్లో తాగునీరు లేకపోతే పక్కగ్రామానికి 3 కిలోమీటర్లు నడిచి వెళ్లి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. రానున్నది మండు వేసవి కావున పరిస్థితులు ఇలాగే కొనసాగితే గ్రామస్తులు తాగునీటికి అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు.

ప్రమాదభరితంగా పాఠశాల భవనం

గ్రామంలో పాఠశాల భవనం ప్రమాదభరితంగా ఉంది. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ పిల్లలు కూడా ఈ భవనంలోనే ఉంటున్నారు. పాఠశాల శ్లాబ్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని పైపెచ్చులు ఊడి పడుతున్నాయి. పాఠశాల సమయంలో పెచ్చులు ఊడితే పిల్లలపై పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తమ గ్రామ పరిస్థితులను అధికారులు చక్కదిద్దాలని నాయకులు, అధికారులకు గ్రామస్తులు విన్నవించుకుంటున్నారు.

సచివాలయ భవనాల పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో?

సీతానగరం: మండలంలోని అంటిపేటలో సచివాలయ భవనం పనులు సార్వత్రిక ఎన్నికల కోడ్ పేరుతో నిలిచిపోయాయి. ఆ భవనాల పనులు ఎప్పుడు పూర్తి చేస్తారోనని స్థానికులు అంటున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన సమయానికి పిల్లర్లు, గోడల నిర్మాణం జరిగింది. అప్పట్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవడం వల్ల పనులు నిలిపి వేయాలని, ఎన్నికలైన వెంటనే అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనాలు పూర్తి చేస్తామని నేటి పాలకులు భరోసా ఇచ్చారు. ఎన్నికలై 9 నెలలు కావస్తున్నా ఇంతవరకూ పనులు ప్రారంభించకపోవడంతో భవన నిర్వాహకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని అంటున్నారు.



అంటిపేటలో నిలిచిపోయిన సచివాలయ భవన సముదాయం

ప్రభుత్వం స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన అంటిపేట సచివాలయం, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్ భవన సముదాయం పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంజలి రథం తయారీకి మామిడి చెట్టు ఎంపిక

సాలూరు రూరల్: శ్రీ శ్యామలాంబ అమ్మవారి పండగను పురస్కరించుకుని అంజలి రథం తయారీకి ఆనవాయితీగా వస్తున్న కర్రివీధి, గాడివీధి పెద్దలు జీగిరాం గ్రామం వద్ద జాతీయ రహదారిలో గల మామిడి చెట్టుకు ఆదివారం పూజలు చేసి చెట్టును కోశారు. అలాగే దుగ్గసాగరం వద్ద సిరిమాను పీట కోసం, సిరిమాను మోసే కర్ర కోసం చింతచెట్టును, తాడిచెట్టును సిద్ధం చేశారు. పూజారి సూచన మేరకు ఈ చెట్లను గుర్తించి శ్యావలాంబ పండగ ఆచార సంప్రదాయాల ప్రకారం శ్రీ శ్యామలాంబ అమ్మవారి పండగ ఏర్పాట్లలో భాగంగా సిద్ధం చేశామని కర్రివీధి పెద్దలు కర్రిసోములు, కేతిరెడ్డి చంద్రశేఖర్, కర్రిసూర్యనారాయణ, కర్రి ప్రసాద్, కర్రితిరుపతి, గాడికోటి తెలిపారు. కార్యక్రమంలో



అంజలి రథం కోసం గుర్తించిన మామిడిచెట్టుకు పూజలు చేస్తున్న కర్రివీధి, గాడివీధి పెద్దలు

వీధిపెద్దలు యువత పాల్గొన్నారు. ఈ చెట్టును నాయుడువీధిలో సిరిమాను వద్దకు సోమవారం చేరుస్తామని వారు తెలిపారు.

బలిజిపేటలో ట్రాఫిక్ సమస్య

బలిజిపేట: మండలకేంద్రంలోని ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య వేధిస్తోందని, పోలీస్ యంత్రాంగం పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. బలిజిపేట హైస్కూల్ నుంచి బస్టాండ్ మీదుగా చిలకలపల్లి వెళ్లే మార్గం, నారాయణపురం వెళ్లే మార్గం ఎంతో ఇరుగ్గా, రద్దీగా ఉన్నప్పటికీ పోలీస్ యంత్రాంగం ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న దాఖలాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు, పాదచారులు చెబుతున్నారు. ప్రధాన రహదారిపై ఎక్కువగా భారీ వాహనాలు వస్తున్నప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడంతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బలిజిపేట బస్టాండ్ నుంచి చిలకలపల్లి, నారాయణపురం వెళ్లే మార్గాల్లో ఎదురెదురుగా రెండు బస్సులు వచ్చినా, పెద్ద వాహనాలు వచ్చినా పక్కకు తప్పుకునేందుకు వీలులేకుండా ఉందని



బలిజిపేటలో వాహనాలతో నిండి ఉన్న ప్రధాన రహదారి

అంటున్నారు. సాయంత్రం సమయాల్లో..రద్దీ ఎక్కువగా ఉండే సమయాలలో పాదచారులు పక్కకు తప్పుకునేందుకు వీలుండడం లేదని, మహిళలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వెళ్లగక్కుతున్నారు. పోలీస్‌శాఖ ట్రాఫిక్ సమస్యపై దృష్టిసారించి నియంత్రించాలని కోరుతున్నారు.

ఈ సారైనా ప్రస్తావించండి..!

- ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ విడుదల చేయాలి
- గిరిజన సంఘం నాయకుల డిమాండ్

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసేవిధంగా చర్యలు చేపట్టాలని సీఐటీయూ, గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 24న జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గిరిజనులకు ఇచ్చిన హామీలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ మేరకు గతంలో ఎమ్మెల్యే విజయచంద్రకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా షెడ్యూల్ ప్రాంతాల్లో జీఓ నంబర్ 3 ఉండడంతో 19శాతంలో 34 రకాల ఉద్యోగావకాశాలు ఆదివాసీలకు హక్కుగా ఉండేది. జీఓ నంబర్ 3 రద్దవడంతో ఆదివాసీలకు ఉద్యోగావకాశాలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీడీఏల ద్వారా జీడిపిక్క బతుకు పేరుతో గిరిజనులకు జీడిమొక్కలు ఇచ్చి నాటించారని, ఇప్పుడు జీడిపిక్కలకు మద్దతు ధర లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీడి పిక్కలకు కనీస మద్దతు ధర ప్రకటించే విధంగా అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించాలని కోరారతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో, ఉద్యోగ, ఉపాధ్యాయ చట్టం, ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల, జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించేలా ప్రభుత్వంపై స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసి గిరిజన సంఘం నాయకులు (ఫైల్)

జీఓ నంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలి

గతంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా అరకులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీఓ నంబర్ 3కు చట్టబద్ధత కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీ కల్పిస్తానన్నారు. ప్రస్తుతం అధికారం చేపట్టి 9 నెలలు గడుస్తున్నా ఎటువంటి స్పందన లేదు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాలను చర్చించి అమలు చేసే విధంగా ప్రకటన చేయాలి.

– కె. రామస్వామి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

గ్రామాల అభివృద్ధికి చెత్తనుంచి సంపద తయారు చేయాలి

- డీపీఓ కొండలరావు

సీతానగరం: చెత్తనుంచి సంపద తయారు చేయడంలో భాగంగా సేంద్రియ ఎరువు ఉత్పత్తి చేస్తే గ్రామాలభివృద్ధికి ఆర్థికంగా దోహద పడుతుందని డీపీఓ కొండలరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని లచ్చయ్యపేటలో ఆదివారం త్రీవీల్స్ రిక్షా తొట్టి బండ్లతో గ్రీన్‌అంబాసిడర్లు ఇళ్లనుంచి సేకరించిన చెత్తను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లనుంచి గ్రీన్‌అంబాసిడర్లు చెత్తసేకరణలో తడి, పొడి వేర్వేరుగా రిక్షాల్లో వేయాలని సూచించారు. ఇళ్లనుంచి సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీల్లో వేర్వేరుగా ఆరబెట్టాలని సూచించారు. గ్రామాల్లో నిర్మించిన చెత్తనుంచి సంపద తయారు కేంద్రా (ఎస్‌డబ్ల్యూపీసీ)ల్లో ఏర్పాటు చేసిన కుండీలు వర్మీ కంపోస్ట్ ఉత్పత్తికి అవసరమైన ఎర్రలను సజీవంగా ఉండేలా జాగ్రత్తలు పడాలన్నారు. అనంతరం ఇళ్లలో తడి-పొడి చెత్తలను రెండు రకాలుగా విభజించి ఎస్‌డబ్ల్యూపీసీల్లో శుద్ధి చేసి కుండీల్లో వేయాల్సి ఉంటుందని చెప్పారు. సిబ్బంది చెత్త నుంచి సంపద తయారు చేయడానికి అవసరమైన అవగాహన కల్పించుకోవాలని చెప్పారు.

స్వచ్ఛమైన నీరు ప్రజలకు అందించాలి



ఇళ్లనుంచి సేకరించిన తడి-పొడి చెత్తను పరిశీలిస్తున్న డీపీఓ కొండలరావు

గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయడానికి వైద్య, పంచాయతీరాజ్,ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీపీఓ కొండలరావు కోరారు. వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న మంచినీటి పథకాల తీరుపై ఆయన మాట్లాడుతూ స్థానిక సువర్ణముఖి నది నుంచి గ్రామాలకు సరఫరా చేస్తున్న మంచినీటి పథకాల ట్యాంక్‌ల్లో విధిగా క్లోరినేషన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, సర్పంచ్ సిహెచ్ కృష్ణ, ఇన్‌చార్జి కార్యదర్శి మురళి, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన రాజన్నదొర

సాలూరు రూరల్: మండలంలోని చింతలవలస గ్రామంలో కొట్టుపరువు పంచాయతీ సర్పంచ్ కుమార్తె పెళ్లికి హాజరై వధూవరులను మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆశీర్వదించారు. ఆదివారం జరిగిన వివాహవేడుకలో ఆయన సందడి చేశారు. రాజన్నదొరతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు మండల అధ్యక్షుడు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, తోణాం సర్పంచ్ మువ్వల ఆదియ్య, సాలూరు పట్టణ నాయకుడు లక్ష్మణరావు తదితరులు హాజరయ్యారు.



వధూవరులు ఉష, కిరణ్‌లను ఆశీర్వదిస్తున్న రాజన్నదొర

ఎల్లమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠ

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం ఐదు గంటల నుంచి పూజల అనంతరం 9 గంటలకు అమ్మవారిని పురవీధుల్లో ఊరేగుతూ ఆలయానికి తీసుకువచ్చారు. జల, ధాన్యాది వాసములు, అష్టదిగ్బలి, ప్రాణప్రతిష్ఠ, సకల దేవతా హోమములు, మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని శృంగేరి పురస్కార గ్రహీత, విద్యా వారాధి పీఠాధిపతులు రంప వామనశర్మ ఆధ్వర్యంలో విద్యా ఉపాసకులు పులఖండం రాంబాబుశర్మ, సింహాచలం ఆస్థాన పండితులు వి.ప్రశాంతకుమార్ శర్మ, గ్రామ పురోహితులు రంప మురళీశర్మ రుత్విజులు నిర్వహించారు.

'రీ'సర్వే వేగవంతం చేయాలి

సీతానగరం: మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ అమలులో భాగంగా లచ్చయ్య పేటలో రీ సర్వే పనులు పూర్తి చేయానికి అవసరమైన చర్యలు చేపట్టామని తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు లచ్చయ్యపేటలో 'రీ సర్వే పనులపై ఆదివారం ఆయన సమీక్షించయారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు మండల సర్వేయర్ పర్య వేక్షణలో గ్రామ సర్వేయర్లు, వీఆర్వోల సమన్వయంతో రీ సర్వే పనులు వేగవంతం చేయనున్నట్లు చెప్పారు. భూములున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను లిఖిత పూర్వకంగా సర్వే చేస్తున్న అధికారులకు నివేదించి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, స్థానిక వీఆర్వో, వీఎస్ఏ పాల్గొన్నారు.

ఘనంగా చెవిటమ్మ తల్లి సంబరాలు

భామిని: మండలంలోని బాలేరు గ్రామంలో నూతనంగా విగ్రహం ప్రతిష్ఠించిన గ్రామదేవత సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య మహిళలు ఘటాలతో ముర్రాటల ప్రదర్శన ముందు గ్రామస్తులు నృత్యాలు చేసుకుంటూ ఊరేగింపు చేశారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతు ప్రచారం

సీతానగరం: ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ బలపర్చిన అభ్యర్థి కె. విజయగౌరి విజయాన్ని ఆకాంక్షిస్తూ యూటీఎఫ్, సీఐటీయూ మండల కమిటీలు ఆదివారం గ్రామాల్లో ఓటర్ల ఇళ్లకు వెళ్లి విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ మేరకు ఓటుహక్కు కలిగిన ఉపాధ్యాయులను యూటీఎఫ్, సీఐటీయూ మండల శాఖ నాయకులు కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.ఆదినారాయణ, డీవీ రమణ పాల్గొన్నారు.



పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరికి మద్దతుగా ప్రచారం చేస్తున్న సీఐటీయూ, యూటీఎఫ్ ప్రతినిధులు

పోలీస్‌స్టేషన్‌కు సామగ్రి వితరణ

సాలూరు: క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ సాలూరు బ్రాంచి సభ్యులు ఆదివారం పట్టణంలో పోలీస్‌స్టేషన్‌కు వాటర్ ప్యూరిఫయర్ కమ్ డిస్పెన్సర్, స్టీల్ సోఫాలను వితరణగా అందించారు. సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ప్రజల సౌలభ్యం కోసం వాటిని అందించినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు.కార్యక్రమంలో సీఐ అప్పలనాయుడు, కంపెనీ డీఎం వెంకటరమణ, లైజనింగ్ అధికారి రమేష్ బాబు, ఏరియా మేనేజర్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌కు సామగ్రి అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

నదీ సంగమంలో గుంప సోమేశ్వరుడు

- శివరాత్రికి చురుగ్గా ఏర్పాట్లు

కొమరాడ: నాగావళి – జంఝావతి నదుల సంగమం వద్ద వెలసిన శ్రీ గుంప సోమేశ్వరాలయం ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందింది. కొమరాడ మండలం కోటపాం పంచాయతీ దేవుని గుంపలో ఉన్న ఈ ఆలయానికి ఘన చరిత్ర ఉంది. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు సోదరుడు బలరాముడు గోహత్య దోష నివారణ కోసం శివుని ప్రార్థించగా నదీ తీరాన ఐదు శివలింగాలు ప్రతిష్ఠించాలని హితబోధ చేశారని కథనం. బలరాములు తన నాగళితో దున్నడంతో నాగావళి నది ఏర్పడినట్టు, మార్గమధ్యలో ఆటంకాలు ఎదురైన చోట శివలింగాలను ప్రతిష్ఠించినట్టు భక్తుల నమ్మకం అలా నది వెంబడి ఒడిశా రాష్ట్రంలోని పాయకపాడులో భీమేశ్వరుడు, దేవునిగుంప వద్ద సోమేశ్వరుడు, వంగర మండలం సంగాం వద్ద సంగమేశ్వరుడు, శ్రీకాకుళం వద్ద రుద్ర కోటీశ్వరుడు, కళ్లేపల్లి వద్ద శ్రీనాగేశ్వరునిగా పూజలు అందుకుంటున్నారు. వీటిలో దేవుని గుంప చాలా ప్రత్యేకమైంది. ఇక్కడి సోమేశ్వరున్ని దర్శించుకుంటే కాశీ యాత్ర చేసినంత పుణ్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. కార్తీకమాసం, శివరాత్రి పర్వదినాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



గుంప సోమేశ్వరుడు

శివరాత్రికి ఏర్పాట్లు...

విశిష్టత కలిగిన గుంప సోమేశ్వరుడు దర్శనార్థం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. శివరాత్రి సందర్భంగా భక్తులు వేల సంఖ్యలో వస్తారని అంచనా అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఈఓ ప్రసాదరావు తెలిపారు. క్యూలైన్ల ద్వారా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకునేందుకు పోలీసుల సహకారం తీసుకుంటామని చెప్పారు.

ఇలా చేరుకోవాలి...

పార్వతీపురం నుంచి 13 కిలోమీటర్లు.. ఇటు ఒడిశా నుంచి వచ్చే భక్తులకు కూనేరు నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయం వరకు రోడ్డు మార్గాన బస్సులు, ఆటోలో కోటిపాం వద్దగాని, గంగారేగువలస మీదుగా ఆలయ ప్రాంగణానికి చేరుకోవచ్చు. అలాగే పార్వతీపురం నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు నడపనుంది.

భూ ఆధార్ తప్పనిసరి

పాలకొండ: రైతులు తమ భూములకు సంబంధించి భూ ఆధార్ తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో వై వాహిని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు రైతులకు అందించాలంటే సొంత పొలం కలిగిన రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో తమ సిబ్బంది రైతులకు సంబంధించి భూ రిజిస్ట్రీ చేపడుతున్నారని తెలిపారు.